క్లుప్తంగా

హెల్మెట్ వాడితే ప్రాణాలకు రక్ష



కొనకనమిట్లలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

కొనకనమిట్ల: ప్రతి వాహనదారుడు తప్పని సరిగా హెల్మెట్ వాడి తమ జీవితానికి భద్రత కల్పించుకోవాలని ఎస్‌ఐ కె.మాధవరావు వాహన దారులకు సూచించారు. శనివారం సాయంత్రం కొనకనమిట్ల సమీపంలో పలు వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలనకు సంబంధించి పత్రాలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడపకూడదన్నారు. హెల్మెట్ వాడకం, దానివలన ఉపయోగాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కంభం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాలులో ఈ నెల 15వ తేదీ సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.



వెంకటరెడ్డిపల్లి నుంచి వై.పాలెం వెళ్లే రోడ్డు



ముటుకుల నుంచి మర్రివేముల వెళ్లే రోడ్డు

చప్టాలకు సైడ్ గోడలు నిర్మించాలి



పుల్లలచెరువు నుంచి గారపెంటకు వెళ్లే రహదారి

> **అధికారులు పట్టించుకోవాలి:** రహదారులు నిర్మించేటప్పుడు వాటి పక్కన ఉన్న చప్టాలకు సైడు గోడలు నిర్మించకపోవడంతో ఆ రహదారిపై వెళ్లే వాహనదారులు చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారు. కనీసం సైడ్ గోడలు ఏర్పాటు చేయకపోయినా, గుర్తులు ఏర్పాటు చేసినా ప్రజలకు ప్రమాదాల నుంచి రక్షణ పొందేవారు. అధికారులు బాధ్యత మరిస్తే ఎలా?
>
> **డి.వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ, ఉమ్మడివరం**

పుల్లలచెరువు: కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేసి రహదారులను నిర్మించినా వాటి పక్కన ఉన్న చప్టాలకు మాత్రం సైడు గోడలను ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి పక్క గ్రామాలకు వెళ్లేందుకు పీఆర్, ఆర్‌అండ్‌బీ రహదారులు ఉన్నాయి. పుల్లలచెరువు నుంచి గారపెంట, మర్రివేములకు, వెంకటరెడ్డిపల్లి నుంచి వై.పాలెం గ్రామాలకు వెళ్లే రహదారిలో మూడు చప్టాలు నిర్మించారు. రహదారులు మరమ్మతులు నిర్వహించేటప్పుడుగానీ, నూతన రహదారులు ఏర్పాటు చేసే సమయంలోగానీ వీటికి సైడు గోడలు ఏర్పాటు చేయడంలో కాంట్రాక్టర్స్, అధికారులు నిర్లక్ష్యం వహించారని ప్రజలు విమర్శిస్తున్నారు. దీంతో రాత్రివేళ అటుగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు చాలామంది ప్రమాదాలకు గురై వైద్యశాలలకు వెళ్లిన వారు మండలంలో చాలామంది ఉన్నారు. అధికారులు ఈ చప్టాలను ఎందుకు ఏర్పాటు చేశారు, ఇవి మూల మలుపులో ఉండటంతో కనీసం అధికారులు వీటి సైడు గోడలను ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటుగా వెళ్తున్న అనుకోని విధంగా ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు కోట్ల రూపాయలు ఖర్చు చేసి రహదారులు నిర్మించినా సైడు గోడలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సైడు గోడలు ఏర్పాటు చేసి మూలమలుపుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సినీ హీరో కమలాకర్‌కు ఘన నివాళి



కమలాకర్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాళ్లూరు (ముండ్లమూరు): సినీ హీరో బూచేపల్లి కమలాకర్‌రెడ్డి వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు ఐవీ సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ పోశం మధుసూదనరెడ్డి, మాజీ సర్పంచ్‌లు పులి కృష్ణారెడ్డి, తూము శివశంకరరెడ్డి, నాయకులు పులి బ్రహ్మారెడ్డి, కుమ్మిత అంజిరెడ్డి, కైపు అశోక్‌రెడ్డి, గువ్వల శ్రీను, లక్కిరెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో డెడ్‌బాడీ ఫ్రీజర్



డెడ్ బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ కామూరి

కొమరోలు: దాతల సహకారంతో పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో దివ్య హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో డెడ్‌బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను ఉంచారు. బాక్స్‌ను తాటిచెర్ల ఎంపీటీసీ శ్రీనివాసుల రెడ్డి, ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ చైతన్య దీపక్ శనివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ అధ్యక్షుడు లొక్కు శరత్‌బాబు మాట్లాడుతూ దాతల సహకారంతో కొమరోలులోని ప్రభుత్వ వైద్యశాలలో డెడ్‌బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఎవరికైనా అవసరమైతే బాక్స్‌ను ఉచితంగా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ చైతన్యదీపక్, ఆర్గనైజేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. టీమ్ సభ్యులు చిన్న పీరయ్య, సిద్దయ్య, సునీల్, సుమన్, బెంజిమన్, రామ్మోహన్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

తాళ్లూరు (ముండ్లమూరు): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తూర్పుగంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్యాధికారులు, సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడే సమయంలో సాధారణంగా జ్వరాలు ప్రబలే ప్రమాదముందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. దోమలు నిల్వ ఉండే ప్రాంతాలైన నిరుపయోగంగా ఉండే తొట్లు, వాడి పడేసిన కొబ్బరి బోండాలు, పాత టైర్లు గుర్తించి తక్షణమే వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకొని ఆరోగ్య సిబ్బంది పని చేయాలన్నారు. ఎవరికి ఎలాంటి అవసరమొచ్చినా ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు మౌనిక, శ్రీకాంత్ రెడ్డి, హెచ్‌ఈ చంద్రశేఖర్, సూపర్‌వైజర్లు స్వానమ్మ, సుశీల, సర్పంచ్ సుమలతారెడ్డి ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రీవారి పూజలు



వెలుగొండలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారు



రేగడపల్లిలో అలంకరణలో శ్రీవారి ఉత్సవమూర్తులు



అలంకరణలో తిరుమలనాథస్వామి



ప్రత్యేక అలంకరణతో ఉభయ దేవేరులతో స్వామివారు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కొనకనమిట్ల: మండలంలోని వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. నమో వేంకటేశాయా నమోనమః అంటూ భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందా.. గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా కోటి కుంకుమార్చన

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మి పద్మావతి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మండలం రోజులు సామూహిక కోటి కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పూజలు శనివారం నాటికి ఇరవై రెండో రోజుకు చేరాయి. ఉభయదాతలను ఆలయంలోకి ఆహ్వానించి, శాలువాలతో సత్కరిస్తున్నారు. వారిచే ప్రత్యేక పూజుల చేయిస్తున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ, అనంతరం అల్పాహారం ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు దీవి శ్రీకాంత్ భట్టర్, ప్రధాన సలహాదారులు మురళీకృష్ణమాచార్యులు, నిర్వాహకులు యక్కలి శేషగిరిరావు, రామాపురం కోటేశ్వరరావు, పెరుమాళ్ల భాస్కర్, మేడా నరసింహారావు, ఎస్.నాగేశ్వరరావు, మల్లయ్య, సాయి పాల్గొన్నారు.

తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన పుణ్య క్షేత్రం శ్రీ గొర్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ స్వామి వారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేసిన అనంతరం పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలతో అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయం ప్రాంగణంలో జీర్ణోద్ధరణ కమిటీ సభ్యులు భక్తుల కోసం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

కన్నుల పండువగా శాంతి కల్యాణం

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం శనివారం నిర్వహించారు. అలాగే రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. చైర్మన్ పి. కేశవరావు, ఆలయ ఈఓ జి.శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఆరాధనోత్సవాలకు శ్రీకారం



ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద శ్రీగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువైన శ్రీగిరి క్షేత్ర పాలకుడు శ్రీ అభయాంజనేయస్వామి ఆగమన ఆరాధనోత్సవాలు శనివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీగిరి వేంకటేశ్వరస్వామివారిని, అభయాంజనేయ స్వామి వారిని దర్శించుకుని పులకితగాత్రులయ్యారు. ఆలయ అర్చకులు, వేద పండితులు అభయాంజనేయస్వామివారికి అర్చన, అభిషేకం, తిరుమంజనం నిర్వహించారు. 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమంలో పలువురు మహిళా భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం ఊంజల సేవ నేత్ర పర్వంగా జరిగింది. శ్రీగిరి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసుడు, ప్రముఖ గాయకుడు వీవీఎస్ వినోద్ కుమార్ ఆలపించిన హనుమాన్ చాలీసాతో పాటు హనుమత్సంబంధమైన భక్తి రస సంకీర్తనలు భక్తులను అలరించాయి. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి, గాయకుడు వినోద్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేటి కార్యక్రమాలు...

అభయాంజనేయస్వామి వారి ఆగమన ఆరాధన ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటలకు హనుమత్ హోమం, పూర్ణాహుతి, సాయంత్రం 5.30 గంటలకు విష్ణు సహస్ర నామ పారాయణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం



వంగపాడులో చావిడిలో కొలువుదీరిన పీర్లు

బేస్తవారిపేట: కులమతాలకు అతీతంగా, మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం వేడుకలు నియోజకవర్గంలో ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా గ్రామాల్లోని చావిళ్లను శుభ్రం చేసి పీర్లను కొలువుదించారు. చావిళ్లను విద్యుద్దీపాలతో అలంకరించారు. పలుచోట్ల అగ్నిగుండాలను తవ్వారు. మూడు రోజులపాటు సరిగెత్తు కార్యక్రమాలు జరుగుతాయి. ఈ వేడుకల్లో హిందూ, ముస్లింలు కలిసి పీర్ల చావిడీల్లో పూజలు చేస్తారు. ఈ నెల 17వ తేదీన మొహర్రం ముగియనుంది. బేస్తవారిపేటలోని సత్రంబజార్, తేరుబజార్, సక్కావారివీధి, మండలంలోని నేకునాంబాద్, వంగపాడు, పిటికాయగుళ్ల, మోక్షగుండం గ్రామాల్లో పీర్లను చావిడ్లలో ప్రతిష్ఠించారు.

కేసు పెట్టిందని మహిళపై దాడి

మద్దిపాడు: కేసు పెట్టిందని మహిళపై కొందరు మహిళలు దాడి చేసిన సంఘటన మద్దిపాడు మండలంలోని ఇనమనమెళ్లూరు ఎంపీసీ నగర్‌లో శనివారం జరిగింది. స్థానిక మహిళ మహేశ్వరి తన బర్రె తోక కత్తిరించారని మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు ఎందుకు పెట్టావంటూ ఆమెపై అదే కాలనీకి చెందిన టీడీపీ సానుభూతిపరులైన కొందరు మహిళలు దాడి చేసి గాయపరిచారు. మహిళను ఒంగోలు రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతోంది.

జోరు వర్షంతో తిప్పలు



రహదారిపై నిలిచిన వర్షం నీరు

కొనకనమిట్ల: ఇటీవల కురిసిన వర్షానికితోడు శనివారం చిరు జల్లుల కురవడంతో మండంలోని గొట్లగట్టు బస్టాండ్ సెంటర్లోని ఒంగోలు–గిద్దలూరు రహదారి స్పీడ్ బ్రేక్ దగ్గర వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేక రహదారిపైన నిలిచాయి. దీంతో రోడ్డుపై నీటి గుంటలా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా రోడ్డు ఎత్తుగా ఉండటంతో వర్షం నీరు రోడ్డుపైనే ఉంటున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారి పక్కన మట్టి తీయించి రోడ్డుపై నిలిచే నీటిని బయటకు వెళ్లే విధంగా చూసి నీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరుతున్నారు.

వీనుల విందుగా శ్రీనివాస గానామృతం

ఒంగోలు మెట్రో: స్థానిక గాంధీ రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి దేవస్థానంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆషాఢ శుద్ధ సప్తమి శనివారం సాయంత్రం శ్రీనివాస గానామృత కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గణపతి, వెంకటేశ్వరస్వామి, శ్రీకృష్ణుని ఉత్సవమూర్తులకు పూజలు చేశారు. అనంతరం పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు భక్తిగీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ 16వ తేదీ సాయంత్రం వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి శాకాంబరి అలంకరణలో భక్తులను అనుగ్రహిస్తారని తెలిపారు. 17వ తేదీ తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం 8:30 గంటలకు ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్రతపూజలో పాల్గొనే దంపతులు మరిన్ని వివరాలకు శ్రీ వాసవీ కోలాట భజన మండలి సభ్యులను సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యేను పరామర్శించిన మంత్రి డోలా



ఎమ్మెల్యే కందులను పరామర్శిస్తున్న మంత్రి బాలవీరాంజనేయ స్వామి

మార్కాపురం: మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి శనివారం మార్కాపురంలోని ఎమ్మెల్యే నివాసానికి వచ్చి పరామర్శించారు. ఇటీవలే ఎమ్మెల్యే కందుల కాలికి సర్జరీ చేయించుకోవడంతో మంత్రి గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డితో వచ్చి పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కాగా బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. యర్రగొండపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు, ఎమ్మెల్యే సోదరుడు కందుల రామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వక్కలగడ్డ మల్లిఖార్జున, తాళ్లపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసిన మంత్రి

పొదిలి: స్థానిక ప్రభుత్వ వైద్యశాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి శనివారం తనిఖీ చేశారు. వైద్యశాలలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. చిన్న పాటి జబ్బులకు కూడా ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తుండటంపై, సౌకర్యాలు ఉండి కాన్పులు చేయక పోవడంపై ఆయన వైద్యులను ప్రశ్నించారు. ముందుగా టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో మర్రిపూడి అడ్డరోడ్డు వద్ద మంత్రి స్వామికి స్వాగతం పలికారు. ముల్లా ఖుద్దూస్, మీగడ ఓబులరెడ్డి, రసూల్, కాటూరి నారాయణ ప్రతాప్, కాటూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.